## జీతాలిప్పించండి సారూ..



*గంగాధర మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన పారిశుధ్య కార్మికులు*

గంగాధర, ఏప్రిల్ 8: మండలంలోని వివిధ గ్రామాల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్లు తమకు ఆరు నెలలుగా జీతాలు రావడం లేదని, వెంటనే ఇప్పించాలని కోరుతూ మంగళవారం ఎంపీడీవో రామును ఆయన కార్యాలయంలో కలిశారు. ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టమవుతున్నదని, డబ్బులు లేక తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి జీతాలు ఇప్పించి తమను ఆదుకోవాలని కోరారు. ఎంపీడీవో రామును వివరణ కోరగా, తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతా ఉన్న వారికి మాత్రమే జీతాలు రాలేదని, ఐఎఫ్ఎస్సీ కోడ్‌లో మిస్టేక్ జరుగడంతో జీతాలు ఆలస్యం అయినట్లు తెలిపారు. సమస్యను పరిష్కరించి జీతాలు వచ్చేలా చూస్తామని తెలిపారు.

## పోషణ పక్షం విజయవంతం చేయాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 8 : పోషకాహార ప్రాముఖ్యతపై ఈనెల 22 వరకు నిర్వహించనున్న పోషణ పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమాల నిర్వహణపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు, వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అనంతరం పోషణ పక్షం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సబిత, మెప్మా పీడీ వేణుమాధవ్, డీటీడీవో పవన్ కుమార్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్ ప్రకాశ్ పాల్గొన్నారు.

## జిల్లా జైలును సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

విద్యానగర్, ఏప్రిల్ 8: కరీంనగర్ జిల్లా జైలును మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. వెంకటేశ్ సందర్శించారు. జైలులో శిక్ష పడిన ఖైదీల క్రిమినల్ అప్పీలు, హైకోర్టులో అప్పీలు చేసుకోవడానికి ఆసక్తి ఉన్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జైలులో ఖైదీల యోగ క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా జైలును సందర్శించి, వారికి కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి జి. విజయ డేని, జైలర్స్ పి. శ్రీనివాస్, బి. రమేశ్, డిప్యూటీ జైలర్స్ ఏ శ్రీనివాసరెడ్డి, ఎస్. సుధాకర్‌రెడ్డి, ఎల్. రమేశ్, ఎస్ అజయ్ చారి, అసిస్టెంట్ డిప్యూటీ జైలర్స్, గార్డింగ్ సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

## విప్రో సంస్థలో ఉద్యోగానికి అల్ఫోర్స్ విద్యార్థిని ఎంపిక



*విద్యార్థినిని అభినందిస్తున్న రవీందర్ రెడ్డి*

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 8 : అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బీఎస్సీ డేటా సైన్స్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కొంక వైష్ణవి విప్రో సంస్థలో ఉద్యోగానికి ఎంపికవగా కళాశాల కరస్పాండెంట్ వీ రవీందర్ రెడ్డి ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిబ్రవరిలో విప్రో సంస్థ నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ లర్నింగ్ ప్రోగ్రాంలో ప్రతిభ చూపి, ఉద్యోగంతో పాటు, ఉన్నత విద్యాభ్యాసానికి స్కాలర్‌షిప్ అందుకోనున్నదని చెప్పారు. ఇక్కడ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, సిబ్బంది ఉన్నారు.

## అంబేద్కర్ జయంత్యుత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

కలెక్టరేట్, ఏప్రిల్ 8 : ఈ నెల 14న జిల్లాకేంద్రంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ అధికారులను ఆదేశించారు. అంబేద్కర్ జయంత్యుత్సవాలపై పలు ప్రజాసంఘాల నాయకులు, జయంత్యుత్సవాల కమిటీ సభ్యులతో కరీంనగర్ కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. జయంత్యుత్సవాల నిర్వహణకు సంబంధించి ప్రజా సంఘాలు, ఉత్సవ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, ఉత్సవాలు ఘనంగా జరిగేలా చూస్తామని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి పవన్ కుమార్, ఆర్డీవో మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పూలే జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 8: ఈనెల 11న జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా సెలవు దినంగా ప్రకటించాలని పూలే బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి ఐలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గడప కోటేశ్, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్‌తో కలిసి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పూలే జయంతిని సెలవు దినంగా ప్రకటించ పోవడంతో అధిక సంఖ్యలో ఆయన అభిమానుల వేడుకల్లో పాల్గొన లేకపోతున్నారని తెలిపారు.

## రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 8: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాల్లో డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నాయబ్ తహసీల్దార్ సమ్మయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. అన్నారం – ఎస్సీ, ఖాదరగూడెం – ఎస్టీ మహిళ, గంగిపల్లి –ఈడబ్ల్యూఎస్, మానకొండూర్–బీసీ బీ మహిళ, మానకొండూర్–జనరల్, పచ్చునూర్–జనరల్ మహిళ, శంషాబాద్–జనరల్ ఎక్స్‌సర్వీస్‌మెన్, పెద్దూర్‌పల్లి– బీసీ సీ, నిజాయితిగూడెం–ఎస్టీ కేటగిరీల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్హతలు, కులం, ప్రాంతీయ ధ్రువీకరణ పత్రాలను గెజిటెడ్ అధికారి ద్వారా అటెస్టెడ్ చేయించి, రూ.250 రుసుముతో దరఖాస్తును ఈ నెల 12 సాయంత్రం 5 గంటల్లోగా తహసీల్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు మానకొండూర్ తహసీల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## నేడు దుర్శేడ్ సొసైటీ వార్షిక మహాసభ

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 8: దుర్శేడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వార్షిక మహాసభ బుధవారం చైర్మన్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి నేతి వేణు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ ఆవరణలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సభ్యులు పాల్గొనాలని కోరారు.

**బహిరంగ ప్రకటన**

సమస్త ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నాక్లయింట్ అగు శ్రీ కండే రాజు వెంకట నర్సయ్య తండ్రి: కీ॥శే॥ కేదారి, నివాసం: జమ్మికుంట మండలము: జమ్మికుంట, జిల్లా కరీంనగర్ గారు, ఈ దిగువ షెడ్యూలు ఆస్తి గృహము నెం.1-1-25, జమ్మికుంట మున్సిపాలిటీ, జమ్మికుంట మండలము, కరీంనగర్ జిల్లా దానికి దిగువ హద్దులు: తూర్పు: గ్రామపంచాయతీ గల్లి పడమర: హుజూరాబాద్ నుండి జమ్మికుంటకు పోవు రోడ్డు, ఉత్తరము: గృహము 1-1-24, దక్షిణం: రాజమల్లు గృహము 1-1-26 గా హద్దులు గలది. గతంలో కీ॥శే॥ కండే రమాదేవి గారి పేరు పై గాల డాక్యుమెంట్ నెం.347/2004 తేది:04-02-2004 గల ఒరిజినల్ (ప్రస్తుత యజమాని శ్రీ కండే రాజ వెంకట నర్సయ్య తండ్రి:కీ॥శే॥ కేదారి) రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ పై మరియు ఈ యొక్క షెడ్యూలు సంబంధించిన ఆస్తి పై ఎటువంటి ఆక్షేపణలు గాని అభ్యంతరాలు, వారసత్వపు హక్కులు మొదలైనవి ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన (7) రోజులలో ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.ఈ ప్రకటన నాక్లయింట్ కోరిక మేరకు ఇవ్వనైనది.

ఇట్లు: సం/- రావికంటి మధుబాబు, న్యాయవాది
ఆఫీసు ఇంటి నెం.7-1-36, ప్రభుత్వ కళాశాల రోడ్, జమ్మికుంట. సెల్: 9849736990

## ఆత్మహత్యకు కారకులైన ముగ్గురికి జీవిత ఖైదు

కోర్టుచౌరస్తా, ఏప్రిల్ 8: ఓ యువకుడి ఆత్మహత్యకు కారకులైన ముగ్గురికి జీవిత ఖైదుతో పాటు రెండు వేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ కరీంనగర్ ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నీరజ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రామగుండం మండలం మర్రిపల్లికి చెందిన గూండా శంకరయ్య తన కూతురిని ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశాడని అదే గ్రామం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన దొబ్బల పవన్(21)పై క్రిమినల్ కేసు పెట్టాడు. ఆ కేసులో నిందితుడు జైలుకు వెళ్లి వచ్చాడు. కొన్నాళ్లకు పవన్‌కు వేరే అమ్మాయితో పెళ్లి సంబంధం కుదిరింది. ఇది తెలిసి 2016 ఆగస్టు 21న మధ్యాహ్నం వ్యవసాయ భూమి వద్దకు వెళ్తున్న పవన్‌ను గూండా శంకరయ్య, అకినపల్లికి చెందిన మెండే శ్రీనివాస్, ఎగ్లాస్పూర్‌కు చెందిన క్యాతం రవీందర్ అడ్డగించి, దూషించి చనిపో అని అవమానపరిచారు. ఇంటికి వచ్చిన పవన్ జరిగిన విషయాన్ని తన తమ్ముడికి చెప్పి రూంలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. వెంటనే దవాఖానకు తరలించినప్పటికీ చనిపోయాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు రామగుండం పోలీసులు.. నిందితులు గూండా శంకరయ్య (40), మెండే శ్రీనివాస్(35), క్యాతం రవీందర్(55)పై కేసు నమోదు చేయగా, ట్రైనీ ఐపీఎస్ అపూర్వ రావు కేసు దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆరెల్లి రాములు కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితులు ముగ్గురికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

# పెట్రో ధరల పెంపుపై పెల్లుబికిన నిరసన

- నగరంలో సీపీఐ ఆధ్వర్యంలో కేంద్రం దిష్టిబొమ్మ దహనం
- అడ్డుకున్న పోలీసులు.. తోపులాటలో కార్యకర్తలకు స్వల్ప గాయాలు



*శంకరపట్నం: ఆటోకు గ్యాస్ సిలిండర్ కట్టి తాళ్లతో లాగుతున్న సీపీఐ నాయకులు*



*నగరంలో దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు*

తెలంగాణచౌక్, ఏప్రిల్ 8: కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచడాన్ని నిరసిస్తూ సీపీఐ నాయకులు కమాన్ చౌరస్తా వద్ద మంగళవారం నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయడానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో నాయకులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఇందులో కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. తోపులాట మధ్య కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను కార్యకర్తలు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఆయిల్ కంపెనీలకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చేందుకే దేశంలో పెట్రో ధరలు పెంచిందని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, నాయకులు మల్లవ్వ, రాయమల్లు, యుగేందర్, మహేందర్, సంపత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శంకరపట్నం, ఏప్రిల్ 8: మండల కేంద్రంలో వంట గ్యాస్ ధరల పెంపుపై సీపీఐ నాయకులు వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై అంబేద్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు ఆటోపై సిలిండర్ కట్టి తాళ్లతో లాగుతూ నిరసన వ్యక్తం చేశారు. పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, నాయకులు గోదరి లక్ష్మణ్, భిక్షపతి, మొగిలి, కుమార్, పోచయ్య, సత్తయ్య, శ్రీనివాస్, రవి, మురళి, నగేశ్, సుకుమార్, షాకీర్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



*ఒలింపియాడ్ ప్రతిభ చూపిన విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్, తదితరులు*

# విద్యార్థులు చదువులో రాణించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 8: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రైవేట్ విద్యా సంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇస్తున్న శిక్షణలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థ సహకారంతో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇటీవల ఒలింపియాడ్‌లో శిక్షణ ఇప్పించారు. ఈ పరీక్ష రాసి మెరిట్ సాధించిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్ ప్రదానోత్సవం కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సైతం అన్ని రంగాల్లోనూ రాణించాలన్న ఆలోచనతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఇందులో భాగంగా అల్ఫోర్స్ విద్యాసంస్థ 400 మంది ప్రభుత్వ విద్యార్థులకు ఒలింపియాడ్‌లో శిక్షణ ఇచ్చిందని, వీరిలో 80 మంది మెరిట్ సాధించగా 16 మందికి మెడల్స్ వచ్చాయని తెలిపారు. మెరిట్ సాధించిన 80 మంది విద్యార్థులకు ఈ నెల 24 నుంచి మరో దఫా శిక్షణ ఉంటుందని తెలిపారు. విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించి శిక్షణకు పంపించాలని, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యార్థులకు ఎప్పుడూ చేయూతనిస్తామన్నారు. శిక్షణకు అయ్యే ఖర్చు అంతా తామే భరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సైన్స్ అధికారి చాడ జైపాల్ రెడ్డి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్, భవిత కేంద్రాల కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 11న కొత్తపల్లి వారసంత వేలం

కార్పొరేషన్, ఏప్రిల్ 8: నగరంలోని కొత్తపల్లి పరిధిలో ఉన్న వార సంతకు ఈ నెల 11న స్థానిక వార్డు కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే నగరంలోని మేకలు, గొర్రెల వధశాల వేలం పాట ఈ నెల 11న ఉదయం 11గంటలకు నగర పాలక సంస్థలోని సమావేశ మందిరంలో ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఏప్రిల్ 8: కరీంనగర్‌లో పలు ప్రాంతాల్లో మరమ్మతుల దృష్ట్యా బుధవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1, 2 ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, లావణ్య వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 8.30 నుంచి 10.30గంటల వరకు శ్రీనగర్ కాలనీ భవానీ కాలనీ, సప్తగిరి కాలనీ, తహేర మసీద్ ఏరియా, అంజనాద్రి టెంపుల్, ధోబీ ఘాట్ ఏరియా, గోదాం ప్రాంతం, బీఎస్ఎఫ్ క్వార్టర్స్, ఉదయం 10నుంచి 11.30గంటల వరకు హౌసింగ్ బోర్డ్, విట్స్ కాలేజ్, సుభాష్ బొమ్మ రోడ్డు నుంచి 1–6వ నంబర్ రోడ్డు వరకు, బొమ్మకల్ రోడ్, వరాహ స్వామి టెంపుల్ ప్రాంతం, మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంటన్నర వరకు మారుతీ నగర్, పాత బజార్, వెంకట సాయి రోడ్డు, కాపువాడ, అశోక్ నగర్, గౌరీశంకర్ కాంప్లెక్స్, అశోక్ నగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## సరిపడా బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు



*ఖాసింపేటలో బస్‌ల వద్ద కిక్కిరిసిన ప్రయాణికులు*

గన్నేరువరం, ఏప్రిల్ 8: ఖాసింపేటలోని మానసాదేవి, అపురూప లక్ష్మీ అమ్మవార్ల ఆలయ సందర్శనకు వచ్చే భక్తులు సరిపడా బస్సులు లేక ఇక్కట్లు పడుతున్నారు. ఇక్కడకు మంగళ, శుక్రవారాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండగా, తిరుగు ప్రయాణంలో 50 మంది ప్రయాణించాల్సిన బస్సులో 150మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. అలాగే గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. అధికారులు స్పందించి అదనపు బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## మహిళా హెల్త్ క్యాంపు పరిశీలించిన డీఎంహెచ్‌వో

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 8: చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళా హెల్త్ క్యాంపును జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ పరిశీలించారు. మహిళలకు అందిస్తున్న వైద్య సేవలు, కల్పిస్తున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది హాజరుపట్టిక, రికార్డులు తనిఖీ చేశారు. ఫార్మసీ స్టోర్స్‌లో మందులు పరిశీలించారు. అనంతరం ఆశ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీవోఎంసీహెచ్ డాక్టర్ సనజవేరియా, చామనపల్లి ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మనోహర్, పీహెచ్ఎన్ విమల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### స్కానింగ్ కేంద్రాల తనిఖీ

విద్యానగర్, ఏప్రిల్ 8: స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జిల్లాలో స్కానింగ్ కేంద్రాలను మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తనిఖీ నిర్వహించారు. గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట వైద్య, పోలీస్ అధికారులు ఉన్నారు.

## 15 నుంచి బీఎస్సీ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 8 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఎస్సీ హానర్స్ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 15 నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల కోసం వేములవాడలోని ధార్మిక డిగ్రీ కళాశాలను పరీక్ష కేంద్రంగా కేటాయించినట్లు తెలిపారు. అలాగే బీఎస్సీ హానర్స్ ఐదో సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 17వ తేదీ ఆఖరు అని తెలిపారు. అపరాధ రుసుము రూ. 300తో ఈ నెల 22వ తేదీ వరకు చెల్లించవచ్చని సూచించారు.

## స్వాతంత్ర్య సమరయోధుడి మృతి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 8: స్వాతంత్ర్య సమరయోధుడు, బొమ్మకల్ మాజీ సర్పంచ్ వెంగళదాసు నారాయణ (100) అనారోగ్యంతో చల్మెడ ఆనందరావు వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆయన మృతికి పలువురు నాయకులు సంతాపం ప్రకటించారు.

## నగరంలో బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం చేయాలి

కార్పొరేషన్, ఏప్రిల్ 8: కరీంనగర్‌లో బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం పారిశుధ్యం, ఇంజినీరింగ్ విభాగం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి అనువైన ప్రదేశాన్ని టెండర్లు పిలవాలన్నారు. కమర్షియల్ వేస్ట్ (బల్క్ వేస్ట్) నిర్వహణకు, కంపాక్టర్ బిన్స్‌కు టెండర్లు పిలవడంతో పాటు పారిశుధ్య వాహనాల మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయించాలన్నారు. ఎస్టీపీలో ఫ్లో మీటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగర వ్యాప్తంగా ప్రజా మరుగు దొడ్ల నిర్వహణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్, ఈఈలు, సంజీవ్, యాదగిరి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ స్వామి, రమేశ్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## మిద్దె తోటలతో అనేక ప్రయోజనాలు

కార్పొరేషన్, ఏప్రిల్ 8: నగరవాసులు మిద్దె తోటల పెంపకంపై దృష్టి సారించాలని, వాటితో అనేక ప్రయోజనాలు ఉన్నాయని నగర కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ మంగళవారం నగరంలోని కిసాన్ నగర్ ఏరియాలో పర్యటించారు. ఆ ప్రాంతంలో పలు నివాస గృహాల్లో పెంచుతున్న మిద్దె తోటలను పరిశీలించారు. ఇంట్లో ఉత్పత్తి అయ్యే తడి చెత్తను హోం కంపోస్టింగ్ చేసి కూరగాయలు, పూల మొక్కలకు వాడుకోవాలని గృహ యజమానులకు సూచించారు.

## ఆకట్టుకున్న 'స్పేస్ ఆన్ వీల్స్'

చొప్పదండి , ఏప్రిల్ 8: రుక్మాపూర్ గ్రామంలోని సైనిక గురుకుల పాఠశాలలో మంగళవారం స్పేస్ ఆన్ వీల్స్ ఎగ్జిబిషన్ నిర్వహించగా, విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానాన్ని చేరువ చేసేందుకు ఎన్ ఆర్ ఎస్ సీ సంస్థ స్పేస్ ఆన్ వీల్స్‌ను 2 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కాళహస్తి తెలిపారు. ఈ ప్రదర్శనలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సైంటిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. శాస్త్రవేత్త డాక్టర్ శంకర్ ప్రసాద్ వివిధ ఉపగ్రహాలు, ప్రయోగ వాహనాల నమూనాల గురించి వివరించారు. విద్యార్థులకు ఇంత అద్భుతమైన అవకాశాన్ని కల్పించిన శాస్త్రవేత్తలను డైరెక్టర్ కల్నల్ కె.సి.రావు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సన్మానించారు.

## అగ్నిప్రమాదం.. గూడు కోల్పోయిన కుటుంబం

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 8: అగ్నిప్రమాదంలో ఓ పూరి గుడిసె పూర్తిగా కాలిపోవడంతో ఓ పేద కుటుంబం గూడు కోల్పోయి రోడ్డున పడింది. స్థానికులు, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన గొల్లెన జ్యోతి–అశోక్ దంపతులు గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ, ఒడ్డెర కాలనీలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం వారి ఇద్దరు పిల్లలు బడికి వెళ్లిపోగా, అశోక్ సైతం పనికి వెళ్లాడు. జ్యోతి దేవుడి చిత్రపటం వద్ద దీపం పెట్టి ఇంటికి తాళం వేసి బయట కూలి పనుల కోసం వెళ్లింది. ఇంతలో వారి ఇంటికి నిప్పంటుకొన్నది. ఇరుగు పొరుగు గమనించి జ్యోతికి సమాచారం అందించారు. కూలి పనుల్లో ఉన్న ఆమె గుడిసె వద్దకు వచ్చి చూసే సరికి కాలిబూడిదయింది. అప్పటికే స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఇంట్లో భద్రపరిచిన రూ.1.50 లక్షలతో పాటు ఇంట్లోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయని జ్యోతి విలపించింది. రెవెన్యూ అధికారులు రాములు, బాబ్‌దేవ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి, ప్రాథమిక సమాచారాన్ని తీసుకున్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

చిగురుమామిడి, ఏప్రిల్ 8: చిగురుమామిడి, చిన్న ముల్కనూర్ గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో చేరిన ఇతర రాష్ట్రాల వలస కూలీల పిల్లలు 25 మందికి మంగళవారం స్కూల్ బ్యాగులు, స్టడీ మెటీరియల్‌ను తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో మధుసూదన్, మండల విద్యాధికారి పావని పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిగురుమామిడి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు రబియా బస్రి, శోభారాణి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు సుజాత, శారద, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

## నేడు సన్నాహక సమావేశం

గంగాధర, ఏప్రిల్ 8 : ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను పురస్కరించుకుని బుధవారం చొప్పదండి నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కురిక్యాల వద్ద గల శుభమస్తు ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్న సమావేశానికి చొప్పదండి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఎంపీడీవోకు సమ్మె నోటీసు

జమ్మికుంట, ఏప్రిల్8: పంచాయతీ కార్మికుల న్యాయమైన కోర్కెలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భీమేశ్‌కు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సిబ్బంది వేతనాలకు బడ్జెట్ కేటాయించాలని, గ్రీన్ చానల్ ద్వారా జీతాలు అందించాలన్నారు. ఇక్కడ నాయకులు రవీందర్‌రావు, కుమార్, రాము, సారయ్య, తిరుపతి, కొమురయ్య, తదితరులున్నారు.

## దళితబంధు నిధులు వెంటనే విడుదల చేయాలి



*మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దళితబంధు సాధన సమితి సభ్యులు*

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 8: దళిత బంధు పథకం రెండో విడుత నిధుల మంజూరు ప్రక్రియను వెంటనే మొదలుపెట్టాలని హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు దళితబంధు సాధన సమితి సభ్యులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. ఇటీవల అన్ని మండలాల్లో దళిత బంధు యూనిట్ల వెరిఫికేషన్ ప్రక్రియ మొదలు పెట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. అయితే కేవలం ఇల్లందకుంట మండలంలో తప్ప ఎక్కడా వెరిఫికేషన్ మొదలు పెట్టలేదని తెలిపారు. దీంతో పట్టణంలోని లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారన్నారు. వెంటనే యూనిట్ వెరిఫికేషన్ వేగవంతం చేసి, గ్రౌండింగ్ మొదలు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో అకినపల్లి ఆకాష్, శనిగరం తరుణ్, అంబాల అరుణ్ పాల్గొన్నారు.

## చిలుకవాగు కబ్జాపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 8: పట్టణ శివారులో ఉన్న చిలుకవాగుతో పాటు పలు కుంటలు, చెరువుల భూములను కబ్జా చేశారని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు, ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య నీటిపారుదల శాఖ ఈఈ శశిభూషణ్‌కు మంగళవారం కేసీ క్యాంపులోని కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ.. వాగులు, చెరువుల పక్కన చేపట్టే నిర్మాణాలకు ఇరిగేషన్ శాఖ నుంచి ఎన్‌వోసీ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉండగా, అవేవీ లేకుండానే మున్సిపల్ అధికారులు యథేచ్ఛగా అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి విచారణ జరిపితేనే కబ్జాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. అక్రమ నిర్మాణాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలను గుర్తించి చట్టపరంగా కూల్చివేయాలని అధికారులను కోరారు.

## ఈవీఎం గోదాము తనిఖీ

కలెక్టరేట్, ఏప్రిల్ 8 : జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎంల గోదామును మంగళవారం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్‌ల గోదాము పరిశీలించి, సమగ్ర నివేదికను ఎన్నికల సంఘానికి పంపుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు మిల్కూరి వాసుదేవరెడ్డి, సత్తినేని శ్రీనివాస్, నాంపల్లి శ్రీనివాస్, కళ్యాడపు ఆగయ్య పాల్గొన్నారు.

## బాలసదనంలో ఆధార్ నమోదు శిబిరం

కలెక్టరేట్, ఏప్రిల్ 8 : నగరంలోని బాలసదనంలో మంగళవారం ఆధార్ నమోదు శిబిరం నిర్వహించారు. జిల్లాలోని వివిధ చైల్డ్‌కేర్ సెంటర్లలో నివసిస్తున్న ఆధార్‌కార్డుల్లేని చిన్నారుల కోసం ఈ శిబిరం ఏర్పాటు చేయగా, 11మంది పిల్లలు ఆధార్ కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు. అనంతరం వారి వివరాలు, ముఖ, కంటి, చేతి వేళ్ల గుర్తులు అప్‌లోడ్ చేసినట్లు డీడబ్ల్యూవో సబిత కుమారి తెలిపారు. కార్యక్రమంలో యూఐడీఏఐ అసిస్టెంట్ మేనేజర్ ఎండి.సౌబన్‌మోహినుద్దీన్, పర్వీన్, పీవోఐసీ శాంత, ఆధార్ కో ఆర్డినేటర్ శ్రీధర్, సీసీఐ ఇన్‌చార్జిలు, డీడబ్ల్యూవో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ

వీణవంక, ఏప్రిల్ 8: మామిడాలపల్లిలో ఇంటి ముందు నిద్రించిన ఓ మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పుస్తెల తాడు ఎత్తుకెళ్లారు. ఎస్ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అవరకొండ సరమ్మ మంగళవారం తెల్లవారుజామున చల్లగాలి కోసం తన ఇంటి ముందుగల బల్లపై నిద్రించింది. తర్వాత లేచి చూసుకునే సరికి తన మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడు చోరీకి గురైనట్లు గ్రహించింది. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

### మోడల్ స్కూల్‌లో క్రీడా సామగ్రి..

గంగాధర, ఏప్రిల్ 8: మండలంలోని న్యాలకొండపల్లి వద్ద గల మోడల్ స్కూల్‌లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మోడల్ స్కూల్‌లో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడి క్రీడా సామగ్రి ఎత్తుకెళ్లారు. మంగళవారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. రూ.15 వేల విలువైన బ్యాట్లు, వికెట్లు, గడియారాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా నిన్న, మొన్నటి దృశ్యాలు కనిపించలేదని, సీసీ కెమెరా కూడా లేదని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు.

## ప్రవాస భారతీయ మిత్రబృందం పరీక్ష ప్యాడ్స్ వితరణ

మానకొండూర్, ఏప్రిల్ 8: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు అమెరికాలోని సిన్సినాటి ప్రాంతానికి చెందిన ప్రవాస భారతీయుల మిత్రబృందం పరీక్ష ప్యాడ్స్‌లను వితరణ చేసింది. మొత్తం 107 మంది విద్యార్థులకు మిత్రబృందం సమకూర్చిన ప్యాడ్లను పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న ప్రవాస భారతీయ మిత్రబృందంలోని ఒకరి బంధువైన ప్రణీత మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కేతిరి జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయులు రమాదేవి, శైలజ, రుక్సానా, అస్మాబేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

## భీమ్ యాత్ర విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 8: ఈ నెల 14న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని నగరంలోని టవర్ సర్కిల్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు చేపట్టనున్న భీమ్ యాత్రను విజయవంతం చేయాలని పలు దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని భీమ్ యాత్ర సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివాజీ, బహుజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కన్నం లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు అజయ్ పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్యక్రమంపై టీచర్లకు అవగాహన

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 8: ఈనెల 19న పట్టణంలో నిర్వహించే పారిశుధ్య కార్యక్రమంపై మంగళవారం హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కే సమ్మయ్య మాట్లాడుతూ.. ప్రజలకు పారిశుధ్యం, పర్యావరణంపై అవగాహన పెంచేందుకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రయోగాంశాలు తయారు చేసి ప్రదర్శించాలన్నారు. ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే మొదటిసారిగా హుజూరాబాద్‌లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాన్నారు.

## మానవత్వం చాటుకున్న గ్రామస్తులు

చొప్పదండి, ఏప్రిల్ 8: మండలంలోని ఆర్నకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న నమిళికొండ మురళీ కృష్ణ సతీమణి ఆకస్మికంగా మృతి చెందగా, చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో గ్రామస్తులు సుమారు రూ.50 వేల ఆర్థిక సాయం అందజేసి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. మిగిలిన సొమ్మును దినకర్మ నిర్వహణకు అర్చకుడికి అందించారు. పదేళ్ల క్రితం ఆర్నకొండ దేవాలయంలో పూజారిగా పనిచేయడానికి వచ్చిన మురళీ కృష్ణ పేదరికంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఆర్థిక సాయం అందించినందుకు బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం సభ్యులు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.